# భాగం 4 జాతీయాలూ సామెతలూ

విషయక్రమం

4.0 ఉద్దేశం
4.1 ప్రవేశిక
4.2 జాతీయం అంటే...
అభ్యాసాలు చేయండి 1
4.3 జాతీయాలలో కొన్ని వర్గాలు
అభ్యాసాలు చేయండి 2
4.4 జాతీయాల గురించి మరికొన్ని విశేషాలు
అభ్యాసాలు చేయండి 3
4.5 సామెత అంటే...
అభ్యాసాలు చేయండి 4
4.6 ముఖ్యవిషయాలను గుర్తుచేసుకొందాం
అభ్యాసాలకు మాదిరి జవాబులు

## 4.0 ఉద్దేశం

ఒక భాషను మాట్లాడే జాతికి ప్రత్యేకంగా ఉండే వలుకుబళ్లనూ, వాటిలోని రకాలనూ, సామెతల లక్షణాలనూ ఈ భాగం ద్వారా ఉదాహరణ పూర్వకంగా విశ్లేషించగలుగుతారు. ఈభాగం పూర్తి అయ్యేవరకు మీరు మీ వచన రచనలో వాటిని రాయగలరు.

## 4.1 ప్రవేశిక

భాషను వాడుకచేయటంలో అనేక అంతరాలు ఉంటాయి. ఉన్న విషయాన్ని సామాన్యంగా ఉన్నది ఉన్నట్లు చెప్పటం

> **అది పిల్లి**
> **పిల్లి గోడమీద కూర్చున్నది**

ఇందులో భావ గాఢతకు ఆస్కారంలేదు. మామూలు విషయం మామూలుగా చెప్పుకుంటున్నాం.

అదే ఒక అవకాశవాది గురించి మాట్లాడుకుంటున్నాం . వాడంటే మనకు రోత. **'వాడా! గోడమీద పిల్లి కదూ!'** అన్నాం. గోడమీద కూర్చున్న పిల్లి అటూ దూకవచ్చు, ఇటూ దూకవచ్చు — వీలునిబట్టి, అవసరాన్ని బట్టి. మాటిమాటికీ ఈ వివరణ అంతా పలికించ నవసరంలేదు. **గోడమీది పిల్లి** అనగానే తెలుగువాడికి పరిస్థితి అంతా బోధపడుతుంది.

పదాలు, అర్థాలు గురించి ఇంతకుముందు చెప్పుకున్నాం గదా! **'గోడ, మీద, పిల్లి'** అన్న పదాలలో ఇంత అర్థం ఎక్కడ ఉన్నది? ప్రత్యేకమైన ఈ కూర్పువల్ల మొత్తానికి విశేషమైన అర్థం వ్యవహారంలో వచ్చింది.

విడివిడిపదాలకు రాని అర్థం, ఇట్లా మొత్తంమీద రావటం విచిత్రంగా ఉంది కదూ! నిజంగా గోడమీద కూర్చున్న ఒక **పిల్లిని గోడమీద పిల్లి"** అని చెప్పవచ్చు. అవకాశవాదిని వర్ణిస్తూ కూడా **గోడమీద పిల్లి** అనవచ్చు. మొదటిది మనం ఈ వరకే చెప్పుకున్నట్లుగా వాచ్యార్థం. రెండవది మన భావ గాఢతను బట్టి తేచవలసిన అర్థం. దీనిని సంప్రదాయంలో వ్యంగ్యార్థం అంటారు.

భావ గాఢతను బట్టి ఒకే విషయాన్ని అనేక రకాలుగానూ చెప్పవచ్చు. **వాడికి కోపం వచ్చింది.** కోపం కొలిచే వస్తువుకాదు; తూకం వేసి చెప్పే వస్తూవూ కాదు. అందువల్ల వక్త తన అభిప్రాయాన్ని పూర్తిగా చెప్పాలంటే రకరకాలుగా చెపపవలసి వస్తుంది.

**చా...లా..కోపం వచ్చింది**
**చచ్చే కోపం వచ్చింది**
**బ్రహ్మాండమయిన కోపం వచ్చింది**
**నమిలి మింగేస్తాడన్నంత కోపం వచ్చింది**

ఇటువంటి పద్ధతులు ఒక్కో భాషలో ఒక్కో విధంగా ఉంటాయి. యధాతథంగా అనువాదం చేస్తే మరో భాషలో ఇవి వలకవు. వీటిని గురించి ఈ భాగంలో చర్చించుకుందాం.

## 4.2 జాతీయం అంటే...

ఒక భాష మాట్లాడే ఒక జాతికి మాత్రమే పరిమితమైన ఇటువంటి పలుకుబళ్లను 'జాతీయాలు' అంటారు. జాతీయాలకు ముఖ్యంగా వర్తించే రెండు లక్షణాలను మనం ఇంతవరకు చెప్పుకున్నాం. గమనించారా?

i) విడివిడి పదాల అర్థంకంటె భిన్నమయిన అర్థం కూర్పు మొత్తంమీద రావటం
ii) ఒక భాషలో ప్రత్యేకంగా ఉన్న పలుకుబడి లేదా నుడికారం

మనం జాతీయం, నుడికారం అనే దీనిని ఆంగ్లభాషలో ఇడియమ్ అంటారు. ఇడియమ్ అంటే ఏమిటో ఒక ఆంగ్ల నిఘంటువు వివరించిన ఈ మాటలను చూడండి:

i. An expression whose meaning cannot be derived from its constituent elements, as kick the bucket in the sense 'to die'

ii. A construction or expression peculiar to a language

### అభ్యాసాలు చేయండి 1

**జాతీయం అంటే ఏమిటో 10 మాటల్లో తెల్పండి.**

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

## 4.3 జాతీయాలలో కొన్ని వర్గాలు

జాతీయాలను అనేక వర్గాలుగా విభజించుకోవచ్చు. అట్టి వర్గాలలో ప్రధానమైన కొన్నింటిని ఇప్పుడు పరిశీలిద్దాం:

i) పురాణ కథలు ఆధారంగా వచ్చినవి

1. **శల్య సారథ్యం**
2. **రామ రాజ్యం**
3. **ఉడతా భక్తి**

ii) ఆచార వ్యవహారాలను బట్టి వచ్చినవి
1. పప్పన్నం పెట్టడం
2. బొట్టూ కాటుక పెట్టి పిలవడం
3. గుంటబెట్టి గంట వాయించడం

iii) జనశ్రుతిగా చెప్పుకునే కథలు ఆధారంగా వచ్చినవి
1. బాదరాయణ సంబంధం
2. వుల్లయవేమార్గం
3. రెంటికి చెడ్డ రేవడు

iv) పరిసరాల పరిశీలన ఆధారంగా వచ్చినవి
1. గొర్రెతోక
2. కాకిగోల
3. దున్నపోతుమీద వాన

v) అనుభవం ఆధారంగా వచ్చినవి
1. కృత్యాద్యవస్థ
2. మొదటికి మోసం
3. పానకంలో పుడక

vi) అతియోక్తులు ఆధారంగా రూపొందినవి
1. ఇనకవేస్తే రాలని జనం
2. ఇద్దరి మధ్యా వచ్చగడ్డివేస్తే భగ్గుమంటుంది
3. ఈ ఇంటిమీద కాకి ఆ ఇంటిమీద వాలదు

vii) విశ్వాసాలు ఆధారంగా వచ్చినవి
1. (తప్పుచేస్తే) కళ్లు పోతాయి
2. (పాపంచేస్తే) నోట్లో పురుగులు పడి చస్తాడు
3. (ఈ ఉపకారం చేస్తే) చచ్చి నీ కడుపున పుడతాను

పైన ఇచ్చిన ఉదాహరణలు చాలా భాగం మన మామూలు వాడుకలో ఉన్నవే. ఏ అర్థాలలో, ఏ సందర్భాలలో వీటిని ఉపయోగిస్తామో ఆలోచించండి.

### అభ్యాసాలు చేయండి 2

i) కింద ఇచ్చిన జాతీయాల అర్థాలను ఆలోచించి తెలుసుకొని తగిన సందర్భాలతో వాక్యాలలో ఉపయోగించండి.

| జాతీయాలు | తగిన సందర్భాలతో వాక్యాలలో |
|---|---|
| ఒళ్లు చేయు | |
| ఒళ్లు బలియు | |
| అమ్మపెట్టే నాలుగూ | |
| వాతాపి జీర్ణం | |
| సుగ్రీవాజ్ఞ | |
| పాము పగ | |
| కళ్లు కాయలు కాచు | |
| కన్నుపొడుచుకొను | |
| కళ్లు చల్లబడు | |
| కళ్లు పొరలుగమ్ము | |
| పగలబడు | |
| వినవిసా | |

ii) ఈ కింద వాక్యాలలో ఉపయోగించిన జాతీయాలను వాటి ఎదురుగా ఖాళీ స్థలంలో రాయండి

| వాక్యం | జాతీయం |
|---|---|
| రెండు దేశాలమధ్య యుద్ధం రావణ కాష్ఠంలా మండుతోంది | |
| రాజకీయాల్లో కొందరు శల్య సారధ్యం చేస్తారు | |
| ఎన్నికల్లోనూ ఓడి, డబ్బుపోయి రామయ్య రెండికీ చెడ్డ రేవడయ్యాడు. | |
| ఎన్ని సమస్యలొచ్చిన సునీల్ నిమ్మకు నీరెత్తినట్లు ఉంటాడు. | |
| వదిరూపాయాలు అప్పిస్తే చచ్చి నీ కడుపున పుడతానని అప్పారావన్నాడు. | |

## 4.4 జాతీయాల గురించి మరికొన్ని విశేషాలు

జాతీయం అన్నది ఒక భాషకు విశిష్టమయిన, పరిమితమయిన పలుకుబడి కావటం చేత ఉన్నది ఉన్నట్లుగా మరో భాషలోకి అనువాదం చేస్తే అనలు అర్థం ఇవ్వకపోగా విపరీతార్థమూ ఇవ్వవచ్చు. జాతీయం సాధారణంగా నన్నివేశం లేదా వక్తయొక్క భావ గాఢతను స్ఫురింపజేస్తుంది. వాడు **అవకాశవాది** అనడానికీ, వాడు **గోడమీద పిల్లి** అనడానికీ తేడా గమనించండి. మొదటి దానిలో వాస్తవికతను ఊరికే చెప్పటమే ప్రధానం. రెండవ రూపంలో అవకాశవాది అయిన అతని పట్ల వక్తకు ఉన్న వైఖరి ధ్వనిస్తుంది.

సాధారణంగా జాతీయంలో నన్నివేశంలోనో, స్థితిలోనో సాదృశ్యం గోచరిస్తుంది. ఒక ఉదాహరణ చూడండి

కళ్లలో నిప్పులు పోనుకున్నా కారం పోనుకున్నా మంటమండి కళ్లు చూడనివ్వవు. ఆ మాట వేరే చెప్పనక్కర్లేదు కదా. అసూయ చెందినప్పుడు కూడా చూసి ఓర్వలేరు. అందుకని ఆ చూడలేక పోవడాన్ని వర్ణిస్తూ **కళ్లల్లో నిప్పులు పోనుకున్నారు, కళ్లల్లో కారం పోనుకున్నారు** అని వర్ణించటంలో ఒక సాదృశ్యం తీసుకొని రావడం జరిగింది.

ఇక్కడ అంతగా పరిశీలించనవసరం లేదు. కానీ తిట్లలో కూడ ఇటువంటి జాతీయమయిన పలుకుబడి ఉన్నది. **నీ తల పగల, నీ నోట్లో దుమ్ముపడ, నీ గొంతు కొయ్య, దుంప తెగ** ఇట్లాంటి వాటిలో అనువాదానికి లొంగనివే ఎక్కువ భాగం. ఇటువంటి స్పర్శ ఉన్నవి భాషలో ఇంకా ఉన్నాయి. చాలా అన్న అర్థంలో విశేషణాలను పునరుక్తి చెయ్యటం: '**పెద్దపెద్ద భవంతులు**' '**మరీమరీ చెప్పాను**'. అట్లాగే అసమాపక క్రియలు పునరుక్తి చెయ్యటం: '**చెప్పి చెప్పి విసుగేసింది**', '**అనగా అనగా**', '**తింటే తింటే గారెలు చేదు**.' వర్ణనలో ధ్వన్యను కరణాలు వాడటం: ''**పెళపెళ విరిగింది**'' **గబగబ పరిగెత్తాడు**' ఇట్లాంటివి జాతీయాలలో ఆ భాష మాట్లాడే వారికి సంస్కృతి, సభ్యతా, నాగరికతా వ్యక్తమవుతాయి. ఆరిపోయిందనటానికి **దీపం కొండెక్కిందనటం**, ఖాళీ అయినాయనటానికి **నిండుకున్నాయి** అనటం గమనించండి. విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, లోకజ్ఞానం జాతీయాలలో ఎట్లా వెల్లడి అయ్యేదీ ఉదాహరణలలో చూశాము.

### అభ్యాసాలు చేయండి 3

రెండు జాతీయాలను పేర్కొని వాటికి 'జాతీయం' లక్షణాలు ఎట్లా సరిపోతున్నాయో 50 పదాల్లో వివరించండి.

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

## 4.5 సామెత అంటే..

సామ్యం అంటే పోలిక. దానినుంచే సామెత అనే మాట పుట్టినట్లు భావిస్తారు. (సామ్యం → సామ్యత → సామెత). సామెత కూడా కొన్ని విషయాలలో జాతీయం వంటిదే. ఏ భాషకు ఆ భాషకు పరిమితమై విశిష్టమైనదిగా ఉండటంలోనూ, భాషీయుల ఆలోచనా సరళి, నభ్యత, సంస్కారం, జీవిత పరిస్థితులు, విశ్వాసాలు మొదలయిన వాటిని ప్రతిబింబించటంలోనూ సామెత జాతీయాన్ని పోలిఉంటుంది.

సర్వ సాధారణంగా సామెతలకుండే లక్షణాలు కూడా కొన్ని ఉన్నాయి. సామెతలను ఇంగ్లీషులో ప్రావెర్బ్స్ అంటారు. ప్రావెర్బ్ అంటే నిఘంటువు ఏమి చెబుతుందో చూడండి:

> A short popular saying that expresses effectively some common place truth or useful thought.
>
> A proverb is such a saying popularly known and repeated, usually expressing simply and concretely, though often metaphorically a truth based on common sense or the practical experience of mankind.

సంక్షిప్తంగా దీని సారాంశం చెప్పుకుంటే సామెత

1. సంక్షిప్తంగా ఉండేది.
2. ప్రచారంలో ఉన్నదై ఉండేది.
3. చెప్పదలుచుకున్న దానిని ప్రభావవంతంగా చెప్పేది.
4. అందరూ గుర్తించే సత్యాన్ని లేదా ప్రయోజనకరమైన ఒక ఆలోచనను వెల్లడించేది.
5. విస్తృతంగా పదిమందికీ తెలిసి, పది మందీ పదేపదే వాడేది.
6. ఒక భావాన్ని లేదా అంశాన్ని సంబోధకంగా, దృష్టాంత పూర్వకంగా చెప్పేది.
7. అట్లా చెప్పిన విషయం లోకజ్ఞానానికీ జాతి అనుభవానికి సరిపడి ఉండేది
8. చెప్పే తీరులో అలంకార చమత్కృతి (తరచు) ఇముడ్చుకున్నది.

ఈ లక్షణాలు సామెతలలో ఎట్లా ఉంటాయో ఉదాహరణకు పరిశీలిద్దాం:

**కాకిపిల్ల కాకికి ముద్దు** అనేది ఒక సామెత. ఈ సామెత ఉపయోగించినప్పుడు మనం చెప్ప దలచుకునేది కాకి గూర్చికానీ కాకి పిల్లలని గూర్చి కానీ కాదు. కాకి నల్లగా అందవికారంగా ఉంటుంది. కాకిపిల్లా అంతే. కాకి పిల్లను చూసి అందరూ చీదరించుకోవచ్చు. రోతపడవచ్చు. కాన్నీ కన్నతల్లి అయిన కాకి మాత్రం దానిని చూసి మురిసిపోతుంది. అది సహజమైన మమకారం.

'నాది' అనుకున్న చోట అటువంటి మమకారం, ముద్దు, మురిసిపోవటం చోటు చేసుకుంటాయి. తాను రాసిన కవిత్వం కావచ్చు. గీసిన బొమ్మ కావచ్చు. చేసిన పని కావచ్చు. ఈ సందర్భంలో ఇటువంటిదే మరో సామెతను కూడా చెప్పవచ్చు. **తా వలచింది రంభ — తా మునిగింది గంగ.** మానవ మనస్తత్వానికి సంబంధించిన ఈ లోకజ్ఞానాన్ని సత్యాన్ని కొద్దిలో పలికించే సామెత ఇది.

ఇక్కడ కాకినే ఎందుకు తీసుకున్నారు. వికార రూపానికి సంకేతంగా కోతిని తీసుకోవచ్చు. ఒంటెను తీసుకోవచ్చు. గాడిదని తీసికోవచ్చు. **కోతి పిల్ల కోతికి ముద్దు, ఒంటెపిల్ల ఒంటెకు ముద్దు** — ఇట్లా అన్నా అర్థం అదే కదా! కాకిపిల్ల కాకికి ముద్దు అనేదే ప్రచారంలోకి వచ్చింది. పదిమందికీ తెలిసింది. పదిమందీ పదేపదే వాడేది. సామెతలు అట్లా ఏర్పడతాయి. సాధారణంగా ఇవి ఎప్పుడు ఎట్లా పుట్టి చలామణీలోకి వచ్చినాయో వివరించలేం. అయితే ఎప్పుడైనా ఒక కవి రాసిన పంక్తి జనానికి బాగా పట్టిపోయి క్రమంగా ఒక సామెతగా చలామణీలోకి రావటం కద్దు. **'పేరులోనేమి పెన్నిధి యున్నది?', 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష'** వంటి వాటికి కొంత అటువంటి ప్రచారం లభించింది. సామెతల వెనక చిన్నచిన్న జానపద కథలూ, ఘటనలూ, అతిశయోక్తులూ కూడా ఉండవచ్చు.

**తాటిచెట్టు ఎందుకెక్కావురా అంటే దూడమేతకు అన్నట్టు దొందూ దొందే**
**బొంకరా బొంకరా పోలిగా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయలంతేసి అన్నట్టు**
**శుభం పలకరా మంకెన్నా అంటే పెళ్ళికూతురు ముండేది అన్నట్టు**

సామెతలు చెప్పటంలో కొన్ని పద్ధతులు తెలుగు వాళ్లలో కనిపిస్తాయి. "**వెనకటికెవడో చెప్పినట్టు**" అనిగాని "**సామెత చెప్పినట్లు**" అనిగాని మొదలు పెడుతూ ఉండటం, **అట**, **అన్నాట్ట**, **అన్నట్టు**, అనటూ ముగించవచ్చు. ఒక్కోసారి ఆ సామెత ఏదోచెప్పకుండానే '**నీ వ్యవహారమంతా ఏదో సామెత చెప్పినట్లుంది**' అంటూంటారు కూడాను. మొత్తంమీద ఏదో లక్షణమైన, ఆక్షేపించ దగిన విషయం ఉంటే సామెత ప్రస్తావన వస్తూ ఉంటుంది.

సామెతలుగా చలామణీ అవుతున్న వాటిలో ఇటువంటి చమత్కారం లేకుండా లోకానుభవం పుష్కలంగా చాటి చెప్పే వాక్యాలూ ఉన్నాయి — '**పరిగెత్తి పాలు తాగే కంటే నిలబడి నీళ్ళు తాగటం మేలు**,' "**మెరిసేదంతా మేలిమికాదు**" వంటివి వీటిని సామెతలనటం కన్నా లోకోక్తులనటం బాగుంటుంది. ఇంగ్లీషులో ఇటువంటిదానిని **maxim** అంటారు.

తెలుగు సామెతలలో అందం హెచ్చించిన లక్షణం మరొకటి ఉన్నది. అది; వాటిలో యతిగాని, ప్రాసగాని, ఆ రెండుగాని ఉండటం. సామెత రెండు భాగాలుగా ఉండి తొలి అక్షరంగాని దాని సమీపధ్వనిగాని రెండో భాగం మొదట ఉండటం యతి. మొదటి భాగంలోని రెండోధ్వని రెండో భాగం రెండోధ్వని కావటం ప్రాస. స్థూలంగా ఈ విధంగా చెప్పుకోవచ్చు.

కాకి పిల్ల—కాకికి ముద్దు. (యతీ, ప్రాస రెండూ)
ఊరంతా ఒకదారి—ఉలిపికట్టెది ఒకదారి. (యతి)
అదుగో పులి అంటే—ఇదుగో తోక. (ప్రాస)

జాతీయంలో ఎట్లాగైతే విడివిడి మాటల అర్థాలకంటె భిన్నమయిన అర్థం మొత్తంమీద వస్తుందో, సామెతలోనూ, అట్లాగే మొత్తం అర్థం వేరే ఉంటుందని మీరు గమనించే ఉంటారు. భాషలో ఈ రెండూ కూడా వాచ్యార్థాన్ని కాక వ్యంగ్యార్థాన్నే బోధిస్తాయి.

**అభ్యాసాలు చేయండి 4**

ఒక సామెత ఆధారంగా దాని లక్షణాలను 25 పదాల్లో రాయండి :

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

## 4.6 ముఖ్య విషయాలను గుర్తుచేసుకొందాం

- ఒక భాష మాట్లాడే జాతికి మాత్రమే పరిమితమైన పలుకుబడిని జాతీయం అంటారు. భావగాఢతను బట్టీ విడివిడి పదాలకు రాని అర్థాలు జాతీయాలకు వస్తాయి.
- జాతీయాలలో కొన్ని వర్గాలున్నాయి. అవి :1. పురాణ కథలు ఆధారంగా వచ్చినవి. 2. ఆచార వ్యవహారాలనుబట్టీ వచ్చినవి. 3. జనశ్రుతిగా చెప్పుకునే కథలను బట్టి వచ్చినవి. 4. పరిసర పరిశీలనను బట్టీ వచ్చినవి. 5. అనుభవంనుంచి వచ్చినవి. 6. అతిశయో క్తులనుబట్టి వచ్చినవి. 7. విశ్వాసాలనుంచి ఏర్పడినవి.
- జాతీయాలలో ఒక భాష మాట్లాడేవారి సంస్కృతీ, నాగరికతా వ్యక్తమవుతాయి.
- సామెత అంటే పోలిక. జాతీయం వంటిదే ఒకరకంగా సామెత.
- సంక్షిప్తంగా ఉండేదీ ప్రచారంలో ఉన్నదీ, ప్రభావవంతంగా చెప్పేదీ, ఒక సత్యాన్ని వెల్లడించేదీ, పదేపదే వాడేదీ, సుబోధకంగా, దృష్టాంతరము చెప్పేదీ, జాతి అనుభవానికి సరిపడేదీ, చమత్కారాన్ని ఇముడ్చుకునేదీ సామెత.

# అభ్యాసాలకు మాదిరి జవాబులు

## అభ్యాసాలు చేయండి 1

ఒక భాషా సమాజానికి అంటే ఆ భాషను మాట్లాడే జాతికి పరిమితమైన ప్రత్యేక పలుకుబడి జాతీయం. విడివిడి పదాల అర్థం కూర్పువల్ల వస్తుంది.

## అభ్యాసాలు చేయండి 2

i) రామారావుకు ఒళ్లు చేసింది; సుబ్బారావుకు ఒళ్లు బలిసింది; కృష్ణుడు అల్లరి చేసి అమ్మపెట్టే నాలుగూ తిన్నాడు; పుల్లయ్య నాలుగు లక్షలు తిని వాతాపిజీర్ణం అన్నాడు; పార్టీ అధ్యక్షుని మాట సభ్యులకు సుగ్రీవాజ్ఞ; వెంకయ్య సుబ్బయ్యమీద పాము పగ పట్టాడు; విదేశాలకు వెళ్లి ఎంతకూ తిరిగిరాని కొడుకు కోసం సుధీర్ తలిదండ్రులు కళ్లు కాయలు కాసేట్లు ఎదురు చూస్తున్నారు; కళ్లు పొడుచుకున్నా కనిపించని చీకటిలో ఒకమారు నడిచివెళ్లాను; ఎన్నికల్లో ప్రత్యర్థిని ఓడించాక బుచ్చయ్య కళ్లు చల్లబడ్డాయి. రాజకీయాధికారంతో మండలాధీశుడు వెంకట్రావుకు కళ్లు పొరలు కమ్మాయి; తమ్ముడు జారిపడ్డప్పుడు సీత పగలపడి నవ్వింది. భర్తమీద కోపంతో సుజాత విసవిసా వంటిల్లోకి వెళ్లింది.

ii) రావణ కాష్ఠం, శల్య సారధ్యం, రెంటికీ చెడ్డరేవడు, నిమ్మకు నీరెత్తినట్లు, చచ్చి నీ కడుపున పుట్టు.

## అభ్యాసాలు చేయండి 3

ఈ రెండు జాతీయాలు ఆధారంగా జాతీయ లక్షణాలను మనం పరిశీలించవచ్చు: 1. పార్వతి, కృష్ణమూర్తుల అనుకూల దాంపత్యం చూసి పక్కింటి సుబ్బారావు కళ్లలో నిప్పులు పోసుకున్నాడు. 2. రాజకీయాల్లో ఆ మహానుభావుడెప్పుడూ గోడమీద పిల్లే. ఈరెండు జాతీయాల్లో సాదృశ్యలక్షణం కనిపిస్తుంది. మొదటి ఉదాహరణ పరిశీలించినట్లయితే కళ్లలో ఎవరూ నిప్పులు పోసుకోరు. పోసుకుంటే కాలిపోతాయి. ఆ నుడికారం అసూయను సూచిస్తుంది. అసూయను సూచించటానికే ఈ సాదృశ్యం. రెండవ ఉదాహరణలో అవసరాన్నిబట్టి అటూఇటూ దూకే గోడమీద పిల్లితో ఒక మహానుభావునికి సాదృశ్యం ఉంది. వ్యంగ్యార్థం జాతీయమైంది.

## అభ్యాసాలు చేయండి 4

కాకిపిల్ల కాకికి ముద్దు అనేది ఒక సామెత. ఈ సామెత ఉపయోగిస్తున్నప్పుడు మనం చెప్పదల్చు కునేది కాకి గురించి కానీ, కాకిపిల్లను గురించికానీ కాదు. కాకి అందవికారమైన పక్షి. కాకి పిల్ల తల్లికన్న తల్లికంటే వేరుగా ఉండదు. కాని కన్నతల్లి బిడ్డను చూసి మురిసిపోతుంది. అది మమకార లక్షణం. ఇది అందరూ గుర్తించే సత్యం. లోకజ్ఞానానికీ, ఆ సామెతను సృష్టించుకున్న జాతికి సహజమైంది.